క్లుప్తంగా

బీసీల అభ్యున్నతికి కృషి


మునికృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

తిరుపతి మంగళం : బీసీల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిలమంద మునికృష్ణ తెలిపారు. సోమవారం మంగళంలోని పార్టీ కార్యాలయంలో ఆయనను స్థానిక నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. నేతలు మాట్లాడుతూ జగనన్న పాలనలో బీసీలకు పెద్దపీట వేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో బీసీలను అణగదొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మునికృష్ణ స్పందిస్తూ.. జగనన్న ఆశయాలకు అనుగుణంగా బీసీల సంక్షేమమే లక్ష్యంగా శ్రమిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి రూరల్ డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీల అధ్యక్షులు గుండ్రాజు శివశంకర్‌రాజు, లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డి, నేతలు తిరుమల ప్రసాద్‌బాబు, మురుగా, దయాకర్ పాల్గొన్నారు.

గురునాథం సేవలు మరువలేం


గురునాథం దంపతులను సత్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : అలిపిరి డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా గురునాథం సేవలు మరువలేమని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి కొనియాడారు. ఉద్యోగ విరమణ సందర్భంగా గురునాథం సన్మాన సభను సోమవారం లీలామహల్ సర్కిల్‌లోని ఓ ఫంక్షన్ హాల్ నిర్వహించారు. చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీకి 36ఏళ్లపాటు వివిధ హోదాల్లో గురునాథం క్రమశిక్షణతో పనిచేశారన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, నేతలు సత్యనారాయణ, అర్జునయ్య, ఆవుల ప్రభాకర్‌యాదవ్, మస్తాన్, సతీష్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

రక్తదానం.. అభినందనీయం


రక్తదానం చేస్తున్న సీఐ సునీల్ కుమార్

తిరుపతి రూరల్ : రక్తదానం చేయడం అభినందనీయమని, మరొకరికి ప్రాణదానం చేసే మహద్భాగ్యం దక్కుతుందని తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం పద్మావతి ఆర్యవైశ్య యువకిరణాలు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా, ఇలాంటి మంచి పనులకు సమయం కేటాయించాలని కోరారు. అనంతరం ఆయన సైతం రక్తదానం చేశారు.కార్యక్రమంలో పద్మావతి ఆర్యవైశ్య నిత్య అన్నదాన సమాజ సేవా సమితి అధ్యక్షుడు సతీష్, ట్రెజరర్ రవిచంద్రగుప్త ,కా ర్యదర్శి సతీష్ కుమార్ , యువ కిరణాలు అధ్యక్షుడు కల్యాణ్ కార్యదర్శి సాయిరాం, కోశాధికారి అనుదీప్ , మహిళా విభాగం సభ్యులు అపర్ణ, ఇందిర, కుమారి, రెడ్డమ్మ పాల్గొన్నారు.

రేపటి నుంచి ధ్వజస్తంభ సంప్రోక్షణ

తిరుపతి కల్చరల్ : అప్పలాయిగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు నూతన ధ్వజస్తంభ సంప్రోక్షణ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ చేపట్టనున్నారు.

పవిత్ర దీక్ష.. పరిపూర్ణం

నాగూర్ కాలనీ మసీదులో ప్రార్థన చేస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి


తిరుపతిలోని ఈద్గా మైదానంలో ఖురాన్ సారాంశం వివరిస్తున్న మతపెద్ద



నమాజు చేస్తున్న చిన్నారి


పాకాలలోని ఈద్గా మైదానంలో ముస్లింల ప్రార్థన

నెలవంక విరిసింది. ఇస్లాం మురిసింది. మాసం రోజుల పవిత్ర దీక్ష.. పరిపూర్ణమైంది. సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని తిరుపతిలోని ఈద్గా మైదానం ప్రత్యేక ప్రార్థనలతో పులకించింది. ఈ క్రమంలోనే నగరంతోపాటు చంద్రగిరి నియోజకవర్గాల్లో ముస్లింలు పెద్దసంఖ్యలో మసీదులకు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో నమాజు చేశారు. అల్లాహ్ ఆశీస్సులు అందుకున్నారు. మతపెద్దల ద్వారా ఖురాన్ సారాంశం ఆలకించారు. పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. పేదలకు తోచిన విధంగా దానధర్మాలు చేశారు.

- తిరుపతి కల్చరల్/ తిరుపతి రూరల్/ చంద్రగిరి/ పాకాల


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం


వసతులు కరువై.. ఎండలోనే ప్రార్థన చేస్తున్న ముస్లింలు

నోటీస్ బోర్డు

- శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7 గంటలకు హనుమంత వాహనసేవ, రాత్రి 7 గంటలకు గజవాహన సేవ.
- పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలని ఎస్పీకి సాయంత్రం 4 గంటలకు వినతిపత్రం సమర్పణ.
- ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ ప్రవచనాలు.

6 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. నవమి రోజున హనుమంత వాహన సేవ జరిపించనున్నారు. 7న కనులపండువగా సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. గృహస్తులు రూ.వెయ్యి చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనే వెసులుబాటు కల్పించారు. 8న శ్రీరామపట్టాభిషేకం, 9న వసంతోత్సవం జరిపించనున్నారు. అలాగే 10 నుంచి 12వ తేదీ వరకు రామచంద్ర పుష్కరిణిలో స్వామివారి తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు.

భారం..చదువుల బేరం!



'ఒక్కసారి మా విద్యాసంస్థకు రండి.. వసతులు చూడండి.. ఫ్యాకల్టీని పరిశీలించండి.. అడ్మిషన్ తీసుకోండి'.. అంటూ ప్రైవేట్ స్కూళ్లు.. కాలేజీల సిబ్బంది ఊదరగొడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. ఆలసించిన ఆశాభంగం అంటూ తొందరపెడుతున్నారు. వీధి వీధిలో ఇళ్లలోకే బ్రోచర్లు విరజిమ్ముతున్నారు. పదోతరగతి పరీక్ష కేంద్రాల వద్ద కరపత్రాలను పంచుతున్నారు. అలాగే పేరెంట్స్‌కు ఫోన్ చేసి వాక్చాతుర్యం ప్రదర్శిస్తున్నారు. ప్రవేశం తీసుకునే వరకు వేళాపాళా లేకుండా వేధిస్తున్నారు. వెంటనే అడ్మిషన్ పొందితే ఫీజు రాయితీ ఇస్తామని ఆశపెడుతున్నారు. ఈ క్రమంలోనే గత విద్యాసంవత్సరంతో పోలిస్తే దాదాపు 35శాతానికి పైగా ఫీజులను అమాంతం పెంచేశారు.

- యథేచ్ఛగా అడ్మిషన్ల దందా
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముమ్మరంగా ప్రవేశాల పర్వం
- తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా నగదు వసూలు

తిరుపతి సిటీ : ప్రైవేటు విద్యాసంస్థల మాయ మాటలను నమ్మి ఎంతో మంది తల్లిదండ్రులు రూ.లక్షల ఫీజులు చెల్లిస్తూ అప్పుల పాలవుతున్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తల్లికి వందనం వంటి ప్రోత్సాహకాలు లేకపోవడంతో ప్రధానంగా మధ్యతరగతి జీవులు నానా అవస్థలు పడుతున్నారు. పిల్లలను పెద్ద పెద్ద స్కూళ్లు, కాలేజీల్లో చదివిస్తే అదో హోదాగా భావించే ప్రజల అమాయకత్వాన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు క్యాష్ చేసుకుంటున్నాయి. ఏటా మార్చి నుంచి మే మధ్యలోనే రూ.వందల కోట్లు పోగు చేసుకుంటున్నాయి. విద్యార్థి తల్లిదండ్రుల నుంచి కేవలం అడ్మిషన్ ఫీజు పేరుతోనే రూ.5వేల నుంచి రూ.10వేలు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే ఎంతో మంది పది పరీక్షలు పూర్తికాక ముందే ఇంటర్‌లో అడ్మిషన్లు పొందడం గమనార్హం.. ప్రతి ప్రైవేటు పాఠశాలలోనూ ఇప్పటికే సగం అడ్మిషన్లు పూర్తికావడం నమ్మలేని నిజం.

శ్రుతి మించింది



తిరుపతిలో విద్యా వ్యాపారం శ్రుతి మించింది. ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఇందుకోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ఫీజులతోపాటు బుక్స్, యూనిఫామ్, యాక్టివిటీస్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేయాలి.

-ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేత

క్లెయిం వేయకుంటే కష్టమే



ప్రైవేటు విద్యాసంస్థల అడ్మిషన్ల దందాకు ప్రభుత్వం క్లెయిం వేయకుంటే తల్లిదండ్రులకు కష్టమే. పేద విద్యార్థులను టార్గెట్ చేసి తల్లిదండ్రులను దోచుకునేందుకు ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల నిర్వాహకులు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి విద్యాసంస్థ వద్ద నోటీస్ బోర్డులో ఫీజుల పట్టికను ప్రదర్శించేలా చర్యల తీసుకోవాలి.

- శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అప్రమత్తంగా ఉండాలి



విద్యాసంవత్సరం ప్రారంభం కాక ముందే కార్పొరేట్ విద్యాసంస్థల వారు విద్యార్థుల తల్లిదండ్రులకు వల వేస్తున్నారు. మోస పోకుండా అప్రమత్తంగా ఉండాలి. నిపుణులైన అధ్యాపకులు, ఆటస్థలం, మౌలిక సదుపాయాలను తెలుసుకుని ప్రవేశం పొందాలి. చెప్పిన ఫీజు కంటే ఎక్కువ అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

- రామచంద్రయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు

దారుణంగా తయారైంది



తిరుపతిలోని ప్రతి వీధిలోనూ ప్రైవేటు పాఠశాల వెలిసింది. ప్రస్తుతం విద్యా వ్యవస్థ దారుణంగా తయారైంది. తల్లిదండ్రులను అప్రమత్తం చేయకపోతే విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటుంది. ఎవరూ నిబంధనలు పాటించడం లేదు. అర్హులైన అధ్యాపకులను ఉండడం లేదు. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

-పద్మావతమ్మ, విశ్రాంత అధ్యాపకులు

మాజీ సర్పంచ్‌కు పరామర్శ


రామ్మూర్తిని పరామర్శిస్తున్న మోహిత్ రెడ్డి

చంద్రగిరి : చంద్రగిరి మాజీ సర్పంచ్ దుబాసి రామ్మూర్తిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పరామర్శించారు. రామ్మూర్తి అల్లుడు వెంకటరమణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా సోమ వారం స్థానిక పాతపేటలోని ఆయన నివాసానికి మోహిత్‌రెడ్డి వెళ్లి రామ్మూర్తి, కుటుంబీకులను ఓదార్చారు. పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, నేతలు ఒంటి శివశంకర్ రెడ్డి, ఆర్ఎస్ మస్తాన్, కొత్తపాటి కోటి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, అజయ్, పాకాల చరణ్, ఉగ్రాణం గురునాథరెడ్డి పాల్గొన్నారు.

నాగూర్‌కాలనీలో చలివేంద్రం

తిరుపతి రూరల్ : మండలంలోని కుంట్రపాకం పంచాయతీ నాగూర్‌కాలనీలో సోమవారం మైనారిటీ నేతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాగునీటితోపాటు మజ్జిగ పంపిణీ చేశారు. ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు మాధవరెడ్డి, యశోద, మైనారిటీ సంఘం అధ్యక్షుడు కరీముల్లా పాల్గొన్నారు.

'సాదుల'కు కళారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న సాదుల మునిరత్నం

తిరుపతి కల్చరల్ : ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకుడు సాదుల మునిరత్నం అందించిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం కళారత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఆదివారం ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా పురస్కారం ప్రదానం చేసింది. సోమవారం ఈ మేరకు అవార్డు గ్రహీతకు కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

వాకర్స్‌కు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న అర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి కల్చరల్ : ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మునిరత్నం సహకారంతో సంఘం సభ్యులకు సోమవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిల్ అర్కాట్ కృష్ణప్రసాద్ హాజరై మజ్జి పంపిణీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని పార్కుల్లో వాకర్స్‌కు మజ్జిగ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపీనాథ్ మాట్లాడుతూ నెలపాటు నిత్యం మజ్జిగ పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రకాంత్, కొత్తపల్లి శంకరయ్య, వెంకటేష్, మునిబాబు, కేశవులు, దేవా నాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం


బ్రహ్మానందరాజును సన్మానిస్తున్న టీటీడీ అధికారులు

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవి ఆలయంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ పొందిన బ్రహ్మానందరాజును సోమవారం ఘనంగా సత్కరించారు. వేదపండితులు ఆశీర్వదించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. వీజీఓ సదాలక్ష్మి , ఏవీఎస్ఓ సతీష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఐ రాములు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘానికి నూతన కమిటీ

తిరుపతి రూరల్ : పెరుమాళ్లపల్లె వద్ద సోమవారం ఓ ప్రైవేట్ పాఠశాలలో విశ్రాంత ఉద్యోగుల మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా రామ్మూర్తి రెడ్డి, కార్యదర్శిగా తిరుమలరెడ్డి, ఉపాధ్యక్షులుగా కుమార్ స్వామిరెడ్డి, కోటిరెడ్డి, కోశాధికారిగా వై.వెంకటరామరెడ్డి కార్యవర్గ సభ్యులుగా పార్వతి, శంకరయ్య, కేశవరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, రామచంద్రారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా సుబ్రమణ్యంరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వహణకు కోశాధికారి వై.వెంకటరామరెడ్డి రూ.12 వేల విరాళం ప్రకటించారు.

'స్టోర్'తో ఎస్వీయూకి సంబంధం లేదు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కన్స్యూమర్ స్టోర్‌తో ఎస్వీయూకి ఎలాంటి సంబంధం లేదని, అక్కడి ఉద్యోగుల తొలగింపులో మా ప్రమేయం ఉండదని రిజిస్ట్రార్ భూపతి నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీయూ కన్స్యూమర్ స్టోర్ ఉద్యోగుల తొలగింపులో అధికారుల పాత్రపై సాక్షి పత్రిక ప్రచురించిన వార్తను ఖండించారు. వర్సిటీకి కన్స్యూమర్ స్టోర్స్ రూ.లక్షల అద్దె బకాయి ఉందని వెల్లడించారు.

ఎండ.. ఛత్రమే అండ!







తిరుపతిలో ఎండలు మండిపోతున్నాయి. చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు, కూరగాయల విక్రేతలు వేసవి తీవ్రతను తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, అలిపిరి పాదాల రోడ్డుపై పలువురు వ్యాపారులు గొడుగు నీడలో తమ వ్యాపారాలు సాగించుకుంటున్నారు. బజారువీధి, పూలవీధిలో దుకాణదారులు రోడ్డుపై కొబ్బరి మట్టలతో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి వాటి కింద కాసేపు విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లోని ఈ దృశ్యాలు సాక్షి కెమెరాకు సోమవారం చిక్కాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి